సాక్షి
గుంటూరు

శుక్రవారం । 10 । జనవరి । 2025




సంక్రాంతి సంబరాలు

నాదెండ్ల: చందవరం ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. రంగవల్లులు తీర్చిదిద్ది భోగి మంటలు వేశారు.



శివాలయంలో పూజలు

కొల్లూరు: అనంత భోగేశ్వర స్వామి 910వ వార్షిక ప్రతిష్ఠా మహోత్సవాన్ని పురస్కరించుకొని శివాలయంలో గురువారం విశేష పూజలు నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 566.00 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడి కాలువకు 9,500 క్యూసెక్కులు విడుదలవుతోంది.

సర్కారు పట్టించుకొనలేదే!

- ఇంకా రైతుల వద్దే ధాన్యం
- ఇప్పటివరకు కొన్నది 22 వేల టన్నులే!
- ఇంకో 10 వేల టన్నుల కొనుగోలుకు అనుమతి కోసం యత్నం
- కనీసం 20 వేల టన్నులైన కొనాలని ప్రజాప్రతినిధుల డిమాండ్
- స్పందించని ప్రభుత్వం
- అనధికారికంగా కొనుగోళ్లు నిలిపేసిన అధికారులు



ధాన్యం రాశి వద్ద ఆవేదనను వివరిస్తున్న చాగంటి చిలకమ్మ

సాక్షి ప్రతినిధి, గుంటూరు : రైతుల వద్ద ఎంత ధాన్యం ఉంటే అంతా కొనుగోలు చేస్తామంటూ ముఖ్యమంత్రి, జిల్లాకే చెందిన పౌరసరఫరాల శాఖ మంత్రి చెప్పిన మాటలు నీటిమీద మూటలే అయ్యాయి. కేవలం 22 వేల టన్నుల ధాన్యం కొనుగోలు చేసిన తర్వాత ప్రభుత్వం చేతులెత్తేసింది. లక్ష్యానికి బహు దూరంగా ఉన్నా ధాన్యం కొనుగోళ్లను అనధికారికంగా నిలిపివేశారు. జిల్లా వ్యాప్తంగా 156 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా ఇప్పటి వరకూ కొనుగోలు చేసింది కేవలం 22 వేల టన్నులే. 25 వేల టన్నుల ధాన్యం కొనుగోలు చేయడానికి అనుమతి ఉన్నా ఇంకా ముందుగానే కొనుగోళ్లను నిలిపివేశారు. జిల్లాలో చాలాచోట్ల ధాన్యం రైతుల వద్దే ఉండిపోయింది. పొన్నూరు, తెనాలి, మంగళగిరి నియోజకవర్గాల్లో ఇంకా ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంది. రైతుల నుంచి ఒత్తిడి ఉండటంతో ధాన్యం కొనుగోలు చేయాలని ప్రజాప్రతినిధులు కూడా అధికారులపై ఒత్తిడి తీసుకువస్తున్నారు. అయితే మరో పదివేల టన్నుల ధాన్యం కొనుగోలు చేసేందుకు అనుమతి కోసం యత్నిస్తున్నామని, రాగానే కొంటామని చెబుతున్నారు. పదివేల టన్నులు ఏ మూలకు సరిపోదని కనీసం 20 వేల టన్నులైనా కొనుగోలు చేయాలని జిల్లాకు చెందిన ఒక ఎమ్మెల్యే జాయింట్ కలెక్టర్‌ను కోరారు. అయితే అధికార యంత్రాంగం మాత్రం ఇప్పటికే చాలా కొనుగోలు చేశామన్న రీతిలో వ్యవహరిస్తోంది.

బస్తా రూ.13 వందలూ పలకని దైన్యం

జిల్లాలో లక్షా 41 వేల ఎకరాల్లో ఈసారి వరి సాగు చేసిన సంగతి తెలిసిందే. తుఫాన్‌లు, భారీ వర్షాలు దెబ్బతీసినా చాలాచోట్ల ఈసారి అధిక దిగుబడులు వచ్చాయి. అయితే బయట మార్కెట్‌లో దళారులు, వ్యాపారులు, మిల్లర్లు కుమ్మక్కై ధరను దారుణంగా పడేశారు. బస్తాకు మద్దతు ధర 1,740 ఉండగా కనీసం 13 వందల రూపాయలకు కూడా కొనని పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలవైపు ఆశగా ఎదురు చూశారు. రైతుల్లో ఎక్కువ మంది కౌలు రైతులే ఉన్నారు. వీరందరూ కౌలు చెల్లించడమే కాకుండా పంట పెట్టుబడులు పెట్టడంతో తీవ్రంగా నష్టపోయే పరిస్థితి వచ్చింది. అయితే తేమ శాతం పేరుతో, గోనె సంచులు సరిపడా లేవన్న సాకులతో ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. ధాన్యం కొనుగోలుకు కీలకమైన తేమశాతం చూసే టెక్నీషియన్లు అందుబాటులో లేకపోయినా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంలో సర్కారు విఫలం అయ్యింది. తేమ శాతం చూశాక, ధాన్యాన్ని గోతాలకు ఎత్తి, సంబంధిత రైస్ మిల్లుకు పంపాక, అక్కడ మరోసారి తేమశాతం చూసి తిప్పి పంపిన సందర్భాలు అనేకం రైతులకు ఎదురయ్యాయి. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో రైతు పోరుబాట నిర్వహించినా, రైతు సంఘాలు పెద్ద ఎత్తున ఆందోళనలు చేసినా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదు. కొన్నది తక్కువే అయినా డబ్బులు వెంటనే చెల్లించామని ప్రచారం చేసుకుంటున్నారు. అయితే రైతులు మాత్రం తమ ధాన్యం కొనుగోలు చేసి తమను ఆదుకోకపోతే ఆత్మహత్యలే దిక్కని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మద్దతు ధర అమలెక్కడ!



రైతుల నుంచి ధాన్యాన్ని బస్తా రూ.1,740లకు కొనుగోలు చేస్తామని సర్కారు చెప్పినా అమలు కావడం లేదు. బహిరంగ మార్కెట్టులో రైతుల నుంచి ధాన్యం బస్తాను రూ.1,300కు కొనడమూ గగనంగా మారింది. ప్రస్తుతం గ్రామాల్లో రైతుల నుంచి వివిధ కారణలతో ధాన్యం కొనుగోలు చేయటం లేదు.

– దానబోయిన గోపి, సుద్దపల్లి, చేబ్రోలు మండలం

చిలకమ్మ వ్యథ..!

తూములూరు(తెనాలి): ఒంటరి మహిళ.. వైకల్యం తోడైంది.. ఏ పనీ చేసుకోలేని పెద్దావిడ కుమార్తె సాయంతో వ్యవసాయం చేస్తున్నారు. పండిన పంటను అమ్ముకునేందుకు అవస్థలు పడుతున్నారు. 'మీరైనా అధికారులతో చెప్పి నా ధాన్యం కొనిపించండి మహాప్రభో' అంటూ 'సాక్షి' విలేకరికి ఫోన్‌లో మొరపెట్టుకున్నారు. ఆ వివరాలిలా ఉన్నాయి. గుంటూరు జిల్లా తెనాలి నియోజకవర్గంలోని కొల్లిపర మండలం తూములూరుకు చెందిన చాగంటి చిలకమ్మ భర్త కాలం చేసి ఏడెనిమిదేళ్లు అవుతోంది. ఆమెకు దావులూరులో రెండున్నర ఎకరాలు, జెముడుబాడులో ఎకరం కలుపుకుని మొత్తం మూడున్నర ఎకరాల వ్యవసాయం ఉంది. ఒక్కతే చూసుకుంటున్నారు. కాస్త వైకల్యం ఉండటంతో కుమార్తె సాయపడుతోంది. ఖరీఫ్ సీజనులో వరి సాగు చేస్తే దాదాపు 90 బస్తాల ధాన్యం దిగుబడి వచ్చింది. నూర్పిడి చేసి 25–30 రోజులైంది. అల్పపీడనంతో ముసురుపట్టి ఉండటంతో దావులూరు అడ్డరోడ్డులోని షెడ్డులో చిలకమ్మ ధాన్యం దాచారు. మార్కెట్లో ధాన్యానికి మద్దతు ధర లేకపోవటంతో ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో అమ్ముకోవాలని భావించారు. అధికారులకు సమాచారమిచ్చారు. తేమశాతం చూసే సాంకేతిక సహాయకుడు వచ్చి ఒక చేలో ధాన్యం 18 శాతం, మరో చేలో ధాన్యం 22 శాతం తేమ ఉందని, ఆరబెట్టి కబురు చేయాలని చెప్పి వెళ్లారు. డిసెంబర్‌లో అడపాదడపా పడిన వర్షాల నుంచి పంటను కాపాడుకుంటూనే చిలకమ్మ ధాన్యాన్ని ఆరబెట్టారు. తేమశాతం తగ్గిందని అధికారులకు సమాచారమిస్తే ఇప్పుడు కొనుగోలు చేయటం లేదని సమాధానమిచ్చారు. గోతాలు లేవనీ, వస్తేగిస్తే పండగ తర్వాత వస్తామని అధికారులు చెబుతున్నారని చిలకమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. నెలరోజులుగా బయట షెడ్డులో ఎలుకల దాడి నుంచి ధాన్యం కాపాడుకోవటం కష్టంగా ఉందని వాపోయారు.

17న గుంటూరు కౌన్సిల్ మీటింగ్ పెట్టండి

కమిషనర్‌కు మేయర్ కావటి లేఖ

సాక్షి ప్రతినిధి, గుంటూరు: ఈనెల 17న గుంటూరు కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయాలని గుంటూరు మేయర్ కావటి మనోహర్‌నాయుడు మున్సిపల్ కమిషనర్ పులి శ్రీనివాసులకు లేఖ రాశారు. ఆ లేఖ పూర్తి పాఠం యథాతథంగా.. ''ఈనెల 4న జరిగిన కౌన్సిల్ సమావేశంలో చిన్న అంశాన్ని పట్టుకుని వివాదం చేసి మీతోపాటు అధికారులు బాయ్‌కాట్ చేశారు. ఆ సమావేశంలో జరిగిన ఘటనలపై తీవ్ర ఆందోళనతో ఈ లేఖ రాస్తున్నా. 30వ డివిజన్ కార్పొరేటర్ షేక్ రోషన్ లేవనెత్తిన ప్రశ్నకు అధికారులు పరిపాలన పరమైన అంశంగా సమాధానమిచ్చారు. దీనిపై డెప్యూటీ మేయర్ మాట్లాడుతుండగా మీరు మైక్రోఫోన్, అజెండా పత్రాలు విసిరి అధికారులతో కలిసి బయటకు వెళ్లిపోవడం కార్పొరేషన్ చరిత్రలో ఊహించని పరిణామం. సమావేశాన్ని అరగంట వాయిదా వేసి పరిస్థితిని చక్కదిద్దడానికి నేను చేపట్టిన చర్యలు ఫలితాన్ని ఇవ్వలేదు. కౌన్సిల్ సమావేశానికి మేయర్‌గా, సభలో చైర్‌పర్సన్‌గా మళ్లీ సమావేశం నిర్వహించడం కోసం మీతో మాట్లాడటానికి నేను చేసిన యత్నాలకు మీ నుంచి ఎటువంటి స్పందనా రాలేదు. సమావేశ నిర్వహణకు సంబంధించి ఏమైనా అభ్యంతరాలు ఉంటే సభలోనైనా లేకపోతే తర్వాత అయినా చర్చించి ఉండాల్సింది. అటువంటి ప్రయత్నం చేయకుండా అధికారులతో కలిసి సమావేశం నుంచి వెళ్లిపోవడం సరైన చర్య కాదు. కౌన్సిల్ సమావేశాలు ప్రజా సమస్యలను పరిష్కరించడానికే. చర్చలలో చురుకుగా పాల్గొనడం, కౌన్సిల్ సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు స్పష్టమైన, నిర్మాణాత్మకమైన సమాధానాలు అందించడం కార్పొరేషన్ అధికారుల విధి. ఈ విషయాన్ని గమనంలో ఉంచుకుని పెండింగ్‌లో ఉన్న అజెండా అంశాలపై చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించేందుకు ఈనెల 17న కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటు చేయాలి. మీతోపాటు అధికారులందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేస్తున్నా. అధికారులు సంయమనంతో బాధ్యతలు నిర్వర్తించాలని కోరుతున్నా'' అంటూ మేయర్ లేఖలో పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

వైభవంగా రాధాకృష్ణుల కల్యాణం



అమరావతి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అమరావతిలోని హనుమత్ గీతామందిరంలో గురువారం రాధాకృష్ణుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. గీతామందిర ధర్మకర్తలైన వలివేటి చంద్రమౌళి, శంకర్ ఆధ్వర్యంలో జరిపిన ఈ కల్యాణ క్రతువును యాజ్ఞిక బ్రహ్మ బృందావనం ఆదిత్య నరసింహమూర్తి శాస్త్రోక్తంగా నిర్వహించారు. క్రతువులో తొలుత విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, నవగ్రహ మండపారాధన, లగ్నాష్టకాలు శాస్త్రోక్తంగా జరిపించారు. కల్యాణంలో 10 జంటలు పాల్గొని స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. పీసపాటి నాగేశ్వరశర్మ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. అనంతరం భక్తులకు నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

యార్డుకు 70,712 బస్తాల మిర్చి



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 70,712 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 69,119 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.7,200 నుంచి రూ.15,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,300 నుంచి 16,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ.7,400 నుంచి రూ.14,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 7,500 నుంచి రూ.15,500 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.11,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 54,442 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి వి.ఆంజనేయులు తెలిపారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



విజయవాడ: ఇంద్రకీలాద్రి దుర్గమ్మ నిత్యాన్నదానానికి గుంటూరుకు చెందిన భక్తులు సి.వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు గురువారం రూ.లక్ష విరాళం సమర్పించారు. వారికి అధికారులు ఆలయ మర్యాదలతో దర్శనభాగ్యం కల్పించారు. వేద పండితులు ఆశీర్వచనం, ఆలయ డీఈఓ రత్నరాజు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద గురువారం 1,818 క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యాంక్ కెనాల్‌కు 144, తూర్పు కెనాల్‌కు 270, పశ్చిమ కెనాల్‌కు 110, నిజాంపట్నం కాలువకు 74, కొమ్మమూరు కాలువకు 505 క్యూసెక్కులు విడుదల చేశారు.

దుర్గమ్మ సేవలో ముఖేష్‌కుమార్ మీనా



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను రాష్ట్ర రెవెన్యూ(ఎకై ్సజ్)శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ముకేష్‌కుమార్ మీనా కుటుంబ సమేతంగా గురువారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన ముఖేష్‌కుమార్‌మీనాకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేయగా, ఆలయ డీఈవో రత్నరాజు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

'ముక్కోటి' ఆశలతో..

- శ్రీహరిని కొలిచేందుకు సిద్ధమైన భక్తజనం
- ముస్తాబైన ఆలయాలు
- విద్యుద్దీప కాంతుల్లో ధగధగ

మంగళగిరి (తాడేపల్లిరూరల్): వైకుంఠ ఏకాదశి సందర్భంగా మంగళగిరి నగరంలోని లక్ష్మీనరసింహ స్వామి ఆలయం ముక్కోటి ఉత్సవాలకు సుందరంగా ముస్తాబైంది. విద్యుద్దీప కాంతుల్లో ధగధగలాడుతోంది. శ్రీహరిని కొలిచేందుకు భక్తులు ముక్కోటి ఆశలతో సంసిద్ధులయ్యారు. శుక్రవారం తెల్లవారుజామున 3 గంటల నుంచి స్వామి ఉత్తర ద్వారం నుంచి గరుడ వాహనంపై దర్శనభాగ్యం కల్పించనున్నారు. ఆలయ ఈఓ రామకోటిరెడ్డి మాట్లాడుతూ ముక్కోటికి తరలిరానున్న భక్తుల కోసం అన్ని ఏర్పాట్లూ చేశామని, సామాన్య భక్తులకు అధిక ప్రాధాన్యమిచ్చి స్వామి దర్శనంతోపాటు శంఖు తీర్థం ఎలాంటి ఇబ్బందీ లేకుండా పంపిణీ చేసేలా చూస్తామని స్పష్టం చేశారు. రెండు రోజుల పాటు భక్తులకు శంఖు తీర్థం అందజేస్తామని చెప్పారు.

ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు

ఉత్సవ ఏర్పాట్లను దేవదాయశాఖ రీజినల్ జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్, డెప్యూటీ కమిషనర్ లీలాకుమార్ ఆలయ కార్యనిర్వహణాధికారి రామకోటిరెడ్డితో కలిసి గురువారం పరిశీలించారు. సూచనలు చేశారు. గుంటూరు లా అండ్ ఆర్డర్ అడిషనల్ ఎస్పీ రవికుమార్, డీఎస్పీ మురళీకృష్ణ బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. బందోబస్తుకు 330 మంది పోలీస్ సిబ్బందిని కేటాయించినట్లు మంగళగిరి సీఐ వినోద్‌కుమార్ తెలిపారు. అలాగే కొలనుకొండ, అమరావతి కరకట్ట వెంబడి ఉన్న ఇస్కాన్ ఆలయాలతోపాటు పెనుమాకలోని వేకటేశ్వరస్వామి గుడి, సీతానగరం విజయకీలాద్రిలో ముక్కోటి వేడుకలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.



విద్యుద్దీప కాంతుల్లో మెరిసిపోతున్న మంగళగిరి లక్ష్మీనరసింహస్వామి ప్రధాన గాలిగోపురం

అధికారులపై రెచ్చిపోయిన టీడీపీ నేతలు

- అనుమతుల్లేకుండా జరుగుతున్న విగ్రహ ఏర్పాటును అడ్డుకున్నారని అక్కసు
- ఎమ్మెల్యే మాధవితోపాటు ద్వితీయశ్రేణి నేతల దౌర్జన్యం

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): గుంటూరు జీటీ రోడ్డులో ఓ సామాజికవర్గానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడి విగ్రహ ఏర్పాటును అనుమతుల్లేని కారణంగా అడ్డుకున్న అధికారులపై బుధవారం రాత్రి టీడీపీ నేతలు రెచ్చిపోయారు. ఆర్ అండ్‌బీ, నగరపాలక సంస్థ, పోలీస్ అధికారులతో వాగ్వాదానికి దిగారు. దీంతో ఉద్రిక్తత నెలకొంది. కలెక్టరేట్ రోడ్డుకు ఎదురుగా జీటీ రోడ్డు మధ్యలో అధికారులు ప్రమాదాల నివారణకు సెంటర్ డివైడర్‌ను, సిమెంట్ దిమ్మెలను ఏర్పాటు చేశారు. ఈ ప్రదేశంలో స్వాతంత్ర్య సమరయోధుడి విగ్రహ ఏర్పాటుకు టీడీపీ నేతలు బుధవారం రాత్రి సన్నాహాలు చేపట్టారు. అనుమతులు లేకపోవడంతో ఆర్అండ్‌బీ డీఈ, నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారులు ఆ ప్రదేశానికి చేరుకుని అనుమతి లేదని చెప్పారు. దీంతో టీడీపీ నేతలు అధికారులపై దురుసుగా ప్రవర్తించారు. వాగ్వాదం జరిగింది. ఎంతసేపటికి టీడీపీ నేతలు వినకపోవడంతో ఆర్అండ్‌బీ అధికారులు నగరంపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీతోపాటు పోలీసులు ఆ ప్రాంతానికి చేరుకుని పనులను నిలిపివేశారు. విషయం తెలుసుకున్న పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి, అనుచరులతో అర్ధరాత్రి ఆ ప్రాంతానికి చేరుకున్నారు. అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ద్వితీయశ్రేణి నాయకులు అధికారులపై దురుసుగా ప్రవర్తించారు. ట్రాన్స్‌ఫర్ చేస్తామంటూ హెచ్చరించారు. అయినా అధికారులు విగ్రహ ఏర్పాటు పనులను పూర్తిగా నిలిపివేశారు.



అధికారులు, పోలీసులతో వాగ్వాదానికి దిగిన ఎమ్మెల్యే మాధవి, ద్వితీయ శ్రేణి టీడీపీ నేతలు

వివాలో సంక్రాంతి సంబరాలు



భోగి మంట చుట్టూ చేరి నృత్యం చేస్తున్న విద్యార్థినులు

పెదకాకాని : నంబూరు వివాది స్కూల్లో గురువారం సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. రంగవల్లులు, గొబ్బెమ్మలు, గడ్డివాములు, ధాన్యపు బస్తాలతో వివా పాఠశాల ప్రాంగణం కళకళలాడింది. ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు. వివా వీవీఐటీ సంస్థల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, అరుణప్రియ దంపతులు భోగి మంట వేసి సంబరాలను ప్రారంభించారు. చిన్నారుల సంప్రదాయ వేషధారణలు, నృత్యాలు, గీతాలాపనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో వివా డైరెక్టర్ ఎల్.టి. కమాండర్ కె.శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ డాక్టర్ సీహెచ్ సరళ, వివా గుంటూరు క్యాంపస్ హెడ్ మామిళ్లపల్లి వేదవాణి పాల్గొన్నారు.



చిన్నారులకు భోగిపళ్లు పోస్తున్న ఆలపాటి

'దీనీ ఇజ్‌తిమా'కు భారీ బందోబస్తు



పెదకాకాని: నంబూరు శివారులోని విశాల ప్రదేశంలో ఈనెల 11న ముస్లిం సోదరులు జరుపుకునే దీనీ ఇజ్‌తిమాకు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు ఎస్పీ సతీష్‌కుమార్ చెప్పారు. గురువారం ఆయన ఇజ్‌తిమా జరిగే ప్రాంగణాన్ని పరిశీలించారు. మతపెద్దలతో చర్చించారు. పెదకాకాని సీఐ నారాయణస్వామికి ఆదేశాలు జారీ చేశారు.

మధ్యవర్తిత్వంతో కేసుల పరిష్కారానికి కృషి



నగరంపాలెం(గుంటూరు వెస్ట్): మధ్యవర్తిత్వం ద్వారా కక్షిదారులు కేసులు పరిష్కరించుకుని సమయం, ధనం వృథా కాకుండా చూసుకోవాలని సుప్రీంకోర్టు మీడియేషన్, కాన్సిలియేషన్ ప్రాజెక్ట్ కమిటీ ప్రతినిధులు ఆచార్య అడ్వకేట్ ప్రమీల (రాజస్థాన్), ఆచార్య అడ్వకేట్ వి.పి.తంకచన్ (కేరళ) చెప్పారు సుప్రీంకోర్టు మీడియేషన్, కాన్సిలియేషన్ ప్రాజెక్ట్ కమిటీ (న్యూఢిల్లీ), రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో ఎంపికైన న్యాయాధికారులకు మధ్యవర్తిత్వంపై 40 గంటల శిక్షణ నిర్వహిస్తున్న విషయం విదితమే. ఈ క్రమంలో గురువారం జిల్లా కోర్టు ఆవరణలోని ది గుంటూరు బార్ అసోసియేషన్ హాల్‌లో న్యాయవాదులకు అవగాహన సదస్సు నిర్వహించారు. శిక్షణ అధికారులు మాట్లాడుతూ మధ్యవర్తిత్వం బాగా ప్రాచుర్యం పొందిందని చెప్పారు. న్యాయవాదులు మధ్యవర్తిత్వం ద్వారా కేసులను పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ వై.వి.ఎస్.బి. జి.పార్థసారథి, జిల్లా కార్యదర్శి టి.లీలావతి, సీనియర్ న్యాయమూర్తులు, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అనురాధ, సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఎస్‌బీఏ ఝాన్సీ పాల్గొన్నారు.

నేడు గుంటూరుకు సీఎం చంద్రబాబు



సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్ కుమార్ తదితరులు

కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటనకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశామని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. గురువారం స్థానిక స్తంభాలగరువులోని చేబ్రోలు హనుమయ్య కంపెనీ ప్రాంగణంలో ఎస్పీ సతీష్ కుమార్, జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు, జిల్లా అధికారులతో కలిసి కలెక్టర్ ఏర్పాట్లను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ శుక్రవారం నరెడ్కో ప్రాపర్టీ షోకు ముఖ్యఅతిథిగా సీఎం హాజరవుతున్నారని వెల్లడించారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, అడిషనల్ ఎస్పీ సుప్రజా, ఆర్ అండ్‌బి ఎస్ఈ శ్రీనివాసరావు, ఈఈ విశ్వనాథరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): సీఎం పర్యటన దృష్ట్యా పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సతీష్‌కుమార్ సూచించారు. హెలిపాడ్ నుంచి చేబ్రోలు హనుమయ్య కంపెనీ సభ ప్రాంగణం వరకు ట్రయల్ కాన్వాయ్‌లో ప్రయాణించి భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. ఏఎస్పీలు కె.సుప్రజ (క్రైం), హనుమంతు (ఏఆర్), ఎస్‌బీ డీఎస్పీ బి.సీతారామయ్య పాల్గొన్నారు.

సిబ్బందికి కమిషనర్ ఆదేశాలు

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): చేబ్రోలు హనుమయ్య కంపెనీ ప్రాంగణంలో శుక్రవారం జరిగే నరెడ్కో ప్రాపర్టీ షో ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు హాజరు కానున్న నేపథ్యంలో హెలిప్యాడ్ నుంచి సభా ప్రాంగణం వరకు నగరపాలక సంస్థ చేపట్టాల్సిన పారిశుద్ధ్య పనులను, రోడ్ల ప్యాచ్ వర్క్‌లను పక్కాగా చేపట్టాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ప్రజారోగ్య, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం కమిషనర్ హెలిప్యాడ్ నుంచి సభ జరిగే హనుమయ్య కంపెనీ వరకు అధికారులతో కలిసి పర్యటించారు. తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, సిటీ ప్లానర్ రాంబాబు, సీఎంఓహెచ్ డాక్టర్ అమృత, ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు, ఈఈ కోటేశ్వరరావు, ఏడీహెచ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో గురువారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 2,600 గరిష్ఠం : రూ. 3,200

మోడల్ ధర రూ. 2,900

క్లుప్తంగా

ఇండస్ ఫుడ్-2025లో తెనాలి డబుల్‌హార్స్ గ్రూప్



తెనాలి: తెనాలి డబుల్‌హార్స్ గ్రూప్ ఈ నెల 8-10వ తేదీల్లో ఇండియా ఎక్స్‌పోజిషన్ మార్ట్, గ్రేటర్ నొయిడా, ఎన్‌సీఆర్-ఢిల్లీలో జరుగుతున్న అతిపెద్ద ఫుడ్ ప్రాసెసింగ్, ఎగుమతి కేంద్రీకృత వాణిజ్య ప్రదర్శనల్లో ఒకటైన ఇండస్ ఫుడ్-2025లో తన భాగస్వామ్యాన్ని చాటింది. 20 దేశాల నుంచి ఫుడ్ ప్రాసెసింగ్ సంస్థలను ఒకచోట చేర్చిందీ కార్యక్రమం. ప్రపంచ ఆహార ఆవిష్కరణలు, భాగస్వామ్యాలను అన్వేషించటానికి ఎగ్జిబిటర్లు, అయిదు వేలకుపైగా అంతర్జాతీయ కొనుగోలుదారులు ఎక్స్‌పోను సందర్శిస్తున్నారు. తెనాలి డబుల్ హార్స్ గ్రూప్ సీఎండీ మునగాల మోహన్‌శ్యాంప్రసాద్ మాట్లాడుతూ గ్రామీణ ఆహారం నాణ్యత, సంప్రదాయ విలువలను పరిచయం చేయడానికి ఈ వేదిక ఎంతో ఉపకరిస్తుందని చెప్పారు. నాణ్యత, సంప్రదాయం, ఆరోగ్యంపై నిబద్ధతను ప్రదర్శిస్తూ, భారతీయ గ్రామీణ ఆహార సంస్కృతి గొప్పదనాన్ని ప్రపంచానికి పరిచయం చేయడానికి ఇండస్ ఫుడ్ తమకు అసాధారణమైన అవకాశాన్ని కల్పించిందన్నారు. తమ ప్రయాణంలో ఇదొక గొప్ప మైలురాయిగా వ్యాఖ్యానించారు. రెండేళ్లుగా ఇండస్ ఫుడ్‌తో భాగస్వామ్యాన్ని కలిగి ఉన్నట్టు తెలిపారు. ఎగ్జిబిషన్‌లో తమ స్టాల్‌ను సందర్శించాలని తెనాలి డబుల్‌హార్స్ జీఎం పీఎస్‌వీ కృష్ణప్రసాద్ కోరారు.

సంప్రదాయాల పరిరక్షణ అందరి బాధ్యత



పెదకాకాని: మన సంప్రదాయాలను, సంస్కృతిని గౌరవించుకోవడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక అన్నారు. పెదకాకాని మండలంలోని వెనిగండ్ల జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. డీఈవో హాజరయ్యారు. ముందుగా ఉయ్ ఎక్స్‌ఎల్ సంస్థ నిర్వహించిన బేస్‌లైన్ టెస్ట్‌లో ప్రతిభ కనపరచిన విద్యార్థులను అభినందించి బ్యాడ్జీలు అందజేశారు. పాఠశాల గ్రౌండ్‌లో భోగి మంటలు వెలిగించి సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్నారు. భోగి పండ్లు పోసి చిన్నారులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు గోళ్ళ జ్యోతి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నంబూరు తిరుపతిరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆపద వేళ అండగా పోస్టల్ బీమా

- తపాలా శాఖ ఖాతాదారులకు ప్రత్యేకం
- రూ.10 లక్షలు, రూ.15 లక్షల బీమా పథకాలు
- 18 నుంచి 65 ఏళ్ల మధ్య వయస్కులు మాత్రమే అర్హులు



తపాలా శాఖ వారి స్టార్ యాక్సిడెంటల్ పాలసీ లోగో

లక్ష్మీపురం: పేద, మధ్య తరగతి వారికి అందుబాటులో ఉండేలా గ్రూప్ యాక్సిడెంట్ గార్డ్ పాలసీని తపాలాశాఖ ప్రవేశపెట్టింది. రూ.599 ప్రీమియంతో రూ.10 లక్షలు, రూ.799తో రూ.15 లక్షల బీమా పాలసీలను అందుబాటులోకి తెచ్చింది. పాలసీదారుడికి ఎలాంటి ప్రమాదం సంభవించినా బీమా తీసుకున్నప్పటి నుంచి ఏడాది పాటు కవరేజీ వర్తిస్తుంది. 18 నుంచి 65 ఏళ్ల మధ్య వయసుగల వారికి మాత్రమే ఇవి వర్తిస్తాయి. 2022 ఏప్రిల్‌లో తొలిసారి తపాలా శాఖ ఈ పథకాలను ప్రవేశ పెట్టంది. ఇప్పటికే గుంటూరు, నరసరావుపేట డివిజన్‌లలో వేల మంది పాలసీ తీసుకున్నట్లు అధికారులు చెప్పారు.

పాలసీ పొందాలంటే...

ఈ పాలసీలు పొందాలంటే ముందుగా పోస్టల్ బ్యాంక్ ఖాతా కలిగి ఉండాలి. ఖాతా లేని వారు రూ.200తో నూతనంగా తెరవాలి. బీమా పాలసీకి రూ.599గానీ, రూ.799 గానీ చెల్లించాలి. ప్రమాదం సంభవిస్తే మాత్రమే ఈ బీమా వర్తిస్తుంది. దీర్ఘకాలిక పక్షవాతం ఉన్న వారికి వర్తించదు. పాలసీ కోసం నగదు చెల్లించిన రోజు అర్ధరాత్రి 12 గంటల నుంచి బీమా రక్షణ లభిస్తుందని తపాలా శాఖ అధికారులు పేర్కొన్నారు. పాలసీదారుకు ఒక బాండ్ కూడా ఇస్తామన్నారు.

ప్రయోజనాలివీ...

- రూ.799, రూ.599 చెల్లిస్తే స్టార్ ఇన్సూరెన్స్ సంస్థ ద్వారా బీమా
- ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.15 లక్షలు, రూ.10 లక్షలు
- శాశ్వత, పాక్షిక వైకల్యం అయితే రూ.15 లక్షలు, రూ.10 లక్షలు
- పిల్లల విద్యా ప్రయోజనం కోసం రూ.50 వేలు, గృహ స్వస్థత రూ.7 వేలు, రూ.5 వేలు,
- ప్రమాదం జరిగితే వైద్య ఖర్చులకు రూ.లక్ష, రూ.75 వేలు
- హాస్పిటల్ నగదు ప్రయోజనం రోజుకు రూ. వెయ్యి, (రూ.6 వేల వరకు)
- దిగుమతి చేసుకున్న మెడిసన్స్, రవాణా ఖర్చులకు రూ.14 వేలు, రూ.12 వేలు
- అంబులెన్స్, పార్థివ దేహాన్ని తరలించటానికి రవాణా ఖర్చులు రూ.11 వేలు, రూ.9 వేలు
- ఒక బంధువు కోసం ప్రయాణ ఖర్చు రూ.11 వేలు, రూ.9 వేలు
- రక్తం కొనుగోలుకు రూ.11 వేలు, రూ.9 వేలు,
- అంత్యక్రియల ఖర్చులు రూ.9 వేలు, రూ.7 వేలు, అన్‌లిమిటెడ్ టెలీ కన్సల్టెన్సీ
- ప్రమాదం ఏ విధంగా చోటు చేసుకున్నా పాలసీ కచ్చితంగా వర్తించేలా నిబంధనలు రూపొందించారు.

12న కౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఉపకార వేతనాలు



ఆహ్వాన పత్రిక విడుదల చేస్తున్న ఈవీ నారాయణ, సేవా కుమార్ తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్ : కౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ 19వ ఉపకార వేతన పంపిణీ కార్యక్రమాన్ని ఈ నెల 12వ తేదీన నిర్వహించనున్నట్లు ట్రస్టు వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ ఈవీ నారాయణ తెలిపారు. గుంటూరులోని ఎస్‌హెచ్‌వో సమావేశ మందిరంలో గురువారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆదివారం గుంటూరు జిల్లా పెదకాకాని మండలం వెనిగండ్ల గ్రామ శివారులోని కౌండిన్య ఐఏఎస్ అకాడమీ భవనంలో ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. ఏపీ, తెలంగాణలకు చెందిన టెన్త్ నుంచి పీహెచ్‌డీ వరకు ప్రతిభ గల 555 మంది పేద, మధ్య తరగతి విద్యార్థులకు రూ.22 లక్షల మేరకు ఉపకార వేతనాలు అందించనున్నట్లు తెలిపారు. ట్రస్టు ప్రారంభం మొదలు ఇప్పటి వరకు ఏడు వేల మందికి రూ.2.10 కోట్లు ఉపకార వేతనాలుగా అందించామని వివరించారు. సొంత భవనంలో బ్యాంకింగ్ , గ్రూప్స్ సహా అన్ని పోటీ పరీక్షలకు నామమాత్రపు ఫీజుతో నిపుణులైన అధ్యాపకులతో శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. ఉపకార వేతన పంపిణీ సభకు జస్టిస్ అమర్నాథ్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరవుతారని, విశ్రాంత ఐఏఎస్ అధికారి పడమటి సుందర్ కుమార్, విశ్రాంత డీజీపీ అత్తిలి సుధాకర్, విశ్రాంత ఐజీ జక్కంశెట్టి సత్యనారాయణ, పొగాకు బోర్డు ఈడీ అద్దంకి శ్రీధర్ బాబు, గుంటూరు, పల్నాడు జిల్లాల ఎస్పీలు ఎస్.సతీష్‌కుమార్ , కె. శ్రీనివాసరావు తదితర ప్రముఖులు అతిథులుగా హాజరవుతారని తెలిపారు. కార్యక్రమానికి ట్రస్టు సభ్యులు, విరాళ దాతలు, విద్యార్థుల తల్లిదండ్రులు హాజరు కావాలని కోరారు. సమావేశంలో ట్రస్టు సభ్యుడు డాక్టర్ టి. సేవాకుమార్, తదితరులు పాల్గొన్నారు.

కష్టపడే మహిళలకు అండగా ప్రభుత్వం

మంత్రి నాదెండ్ల మనోహర్



రుణాల చెక్కును అందజేస్తున్న మంత్రి

తెనాలి: మహిళల ఆర్థిక స్వావలంబనకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. డ్వాక్రా మహిళలు తీసుకున్న రుణాలను తిరిగి చెల్లిస్తుండటం గొప్ప విషయమని పేర్కొన్నారు. బ్యాంకు లింకేజీతో రుణాల పంపిణీని గురువారం సాయంత్రం స్థానిక తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో నిర్వహించారు. రూ.20.95 కోట్ల చెక్కులను ఆయా సంఘాలకు అందజేశారు. మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న అధ్యక్షత వహించారు. మంత్రి మనోహర్ మాట్లాడుతూ.. పట్టుదలతో కష్టపడి పనిచేసే వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. డ్వాక్రా మహిళలకు గతం కన్నా అధికంగా రుణాలు ఇస్తున్నట్టు చెప్పారు. తెనాలి-మంగళగిరి మధ్య నాలుగు లేన్ల రోడ్డును అభివృద్ధి చేస్తామని, నేలపాడు రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తామని చెప్పారు. పట్టణంలో పార్కులను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, ఎంపీడీవో అత్తోట దీప్తి, బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.

నిరంతర సాధనతో విజయం సొంతం

పంచ సహస్రావధాని డాక్టర్ మేడసాని మోహన్



చేబ్రోలు: విద్యార్థులు నిరంతర సాధనతో లక్ష్యాన్ని చేరుకోవచ్చని పంచ సహస్రావధాని డాక్టర్ మేడసాని మోహన్ అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో విద్యార్థులకు ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జ్ఞానంతో సమానమైన ఐశ్వర్యం లేదని, జ్ఞానం తెలుసుకునేకొద్దీ ఔచిత్యం పెరుగుతూనే ఉంటుందన్నారు. విద్యార్థులందరూ చదువుల సారాంశాన్ని గ్రహించాలని చెప్పారు. సత్యాన్వేషణతో కూడిన అధ్యయనగుణం ఉండాలన్నారు. జీవితంలో ఒత్తిడిని అధిగమిస్తేనే భవిష్యత్తు బంగారమయం అవుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు రోజూ ధ్యానం చేయటం వలన ఏకాగ్రతను, జ్ఞాపకశక్తిని పెంచుకోవచ్చన్నారు. చదువు వల్ల ప్రయోజనాలను తెలిపేలా రామాయణం, మహాభారతంలోని సన్నివేశాలను వివరించారు. ప్రతి ఒక్కరూ జీవితంలో వారి లక్ష్యాలను చేరుకోవటానికి నిరంతరం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో విజ్ఞాన్ విద్యా సంస్థల సమన్వయకర్త గుదిమెళ్ల శ్రీకూర్మనాథ్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి పాఠశాలలకు సంక్రాంతి సెలవులు

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు జిల్లాలో అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలలకు శుక్రవారం నుంచి ఈ నెల 19 వరకు సంక్రాంతి సెలవులు ప్రకటించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అకడమిక్ కేలండర్ ప్రకారం పాఠశాలలు ఈ నెల 20న పునః ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. అదే విధంగా మిషనరీ పాఠశాలలకు 11 నుంచి 15వ తేదీ వరకు పండుగ సెలవులు ప్రకటించినట్లు తెలిపారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు గమనించాలని సూచించారు.

ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎన్నిక



అధ్యక్షుడు జంగాల చైతన్య



ప్రధాన కార్యదర్శి షేక్ వలి

లక్ష్మీపురం: గుంటూరులో జరుగుతున్న ఏఐవైఎఫ్ జిల్లా 21వ మహాసభల సందర్భంగా రెండో రోజు జరిగిన ప్రతినిధుల సభలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా జంగాల చైతన్య, జిల్లా ప్రధాన కార్యదర్శిగా షేక్ వలిని ఎన్నుకున్నారు. కొత్తపేటలోని సీపీఐ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మహాసభల సమావేశంలో అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ .. అమరావతి ఫ్రీజ్ జోన్‌గా ప్రకటించాలన్నారు. రాజధాని ప్రాంతంలో భర్తీ చేసే ఉద్యోగాలలో 26 జిల్లాల నిరుద్యోగ యువతకు అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను పరిరక్షించడంతోపాటుగా కడప స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగాలు కల్పించాలన్నారు. గుంటూరు జిల్లా సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక వనరుల ఆధారంగా పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు 80 శాతం ఉద్యోగ ఉపాధి అవకాశాల కల్పనకు ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 3.20 లక్షల ఉద్యోగాల భర్తీకి చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. మెగా డీఎస్సీ ప్రకటించాలన్నారు. ఆంక్షలు లేకుండా నిరుద్యోగులకు భృతి ఇవ్వాలని పేర్కొన్నారు. అనంతరం జిల్లా మహాసభ డిమాండ్లను ప్రభుత్వం ఆమోదించేలా పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిస్తూ కార్యక్రమంలో తీర్మానించారు.

ఎన్జీ రంగా వర్సిటీలో సలహామండలి సమావేశం



మాట్లాడుతున్న వీసీ డాక్టర్ ఆర్. శారద జయలక్ష్మీదేవి

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానం నందు గత రెండు రోజులుగా జరుగుతున్న పరిశోధన, విస్తరణ సలహామండలి సమావేశం గురువారంతో ముగిసింది. వీసీ డాక్టర్ ఆర్ శారద జయలక్ష్మీదేవి అధ్యక్షత వహించారు. పరిశోధన సంచాలకులు డాక్టర్ పి. సత్యనారాయణ కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. గత ఏడాది కార్యక్రమాలు, మున్ముందు ఏడాదిలో చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించారు. సలహామండలి సభ్యులు వారి ప్రాంతాల్లో సాగు, వ్యవసాయ ఉత్పత్తులు, ప్రాసెసింగ్, మార్కెటింగ్ వంటి అంశాల్లో ఎదుర్కొంటున్న సమస్యలు, స్థితిగతులు వివరించారు. వివిధ పంటల ప్రధాన శాస్త్రవేత్తలు రైతుల సమస్యలకు పరిష్కారాలు వివరించారు. యాంత్రీకరణ, బయోఫోర్టిఫైడ్ రకాల విడుదల, రైతులకు అందించే విషయాలపై చర్చించారు. ఫుడ్ ప్రాసెసింగ్, వ్యవసాయ రంగాల్లో డ్రోన్ల వినియోగం, పంట వ్యర్థాల సద్వినియోగం వంటి అంశాలపై పరిశోధన, విస్తరణ చేపట్టాలని నిర్ణయించారు. రైతుల సమస్యలను పరిష్కరించి రైతుకు రాబడి పెంచేలా మారుతున్న వాతావరణ పరిస్థితులు పరిగణనలోకి తీసుకుని పరిశోధనలు ఉండాలని నిర్దేశించారు. విస్తరణ సంచాలకులు వివిధ ఫార్మింగ్ స్టేషన్స్‌లో ఉన్న పరిశోధన, విస్తరణ ఆచరణల్లో ఉన్న గ్యాప్‌ను దృష్టిలో ఉంచుకుని కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం అధికారులు, శాస్త్రవేత్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఏడుగురు హెచ్‌ఎంలకు షోకాజ్ నోటీసులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఈ నెల 7వ తేదీన గుంటూరులోని జిల్లా పరీక్షా భవన్‌లో జరిగిన భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ బిగినర్స్ సమావేశానికి ఎటువంటి అనుమతి లేకుండా గైర్హాజరైన ఏడుగురు ప్రధానోపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక గురువారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. సిరిపురం, నల్లపాడు, ముట్లూరు, నూతక్కి, పెనుమాక, అంగలకుదురు జెడ్పీ ఉన్నత పాఠశాలలతో పాటు యర్రబాలెంలోని ఎంపీపీ స్కూల్ హెచ్‌ఎంలపై చర్యలు ఎందుకు తీసుకోకూడదో వివరణ ఇవ్వాలని ఆదేశించారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల అకౌంట్లలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ నిమిత్తం నగదు జమ చేసినప్పటికీ, సమావేశానికి గైర్హాజరు కావడంపై షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

సీఏ ఫైనల్ టాపర్‌కు సత్కారం



రిషబ్ ఓస్వాల్‌కు రూ.లక్ష చెక్కు అందజేస్తున్న మట్టుపల్లి మోహన్

గుంటూరు ఎడ్యుకేషన్ : ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) ఇటీవల ప్రకటించిన సీఏ ఫైనల్ ఫలితాల్లో జాతీయ స్థాయిలో ప్రథమ ర్యాంకర్‌గా నిలిచిన ఆర్.రిషబ్ ఓస్వాల్‌ను మాస్టర్‌మైండ్స్ అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ ఘనంగా సత్కరించారు. గుంటూరులోని మాస్టర్‌మైండ్స్ కార్యాలయంలో గురువారం జరిగిన మీడియా సమావేశంలో మట్టుపల్లి మోహన్ మాట్లాడుతూ.. దేశంలోని అన్ని రంగాల్లో ఆర్థిక కార్యకలాపాలను చక్కదిద్దడంలో సీఏల పాత్ర కీలకమన్నారు. సీఏలకు ఉజ్వల భవిష్యత్తు ఉందని చెప్పారు.ఏటా మూడు సార్లు జరుగుతున్న సీఏ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థుల్లో ప్రతి దశలో 40 నుంచి 45 శాతం మంది ఉత్తీర్ణులవుతున్నారని చెప్పారు. సాధారణ విద్యార్థులు సైతం మంచి కెరీర్‌ను ఎంచుకునేందుకు కామర్స్ కోర్సులు దోహదపడుతున్నాయని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి రిషబ్ ఓస్వాల్ మాట్లాడుతూ.. మాస్టర్‌మైండ్స్‌లో విద్యాబోధన, అధ్యాపకుల సహకారంతోనే తాను సీఏ ఫైనల్‌లో టాపర్‌గా నిలిచానని చెప్పారు. ఈ సందర్భంగా రిషబ్ ఓస్వాల్‌ను సత్కరించిన మోహన్.. రూ.లక్ష చెక్కును బహుమతిగా అందజేశారు.

కౌలు రైతులకు విరివిగా పంట రుణాలు



మాట్లాడుతున్న డీఏఓ నున్న వెంకటేశ్వర్లు

కొరిటెపాడు (గుంటూరు): జిల్లాలో కౌలు రైతులకు విరివిగా పంట రుణాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని గుంటూరు జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కంచుమాటి అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఏపీ కౌలు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు గురువారం వెంకటేశ్వర్లు, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ మహిపాల్ రెడ్డి, గుంటూరు ఏడీఏ తోటకూర శ్రీనివాసరావులను కలిసి కౌలు రైతులకు రుణాలివ్వాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో డీఏఓ మాట్లాడుతూ.. గుంటూరు జిల్లాలో 40 వేల మంది కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు మంజూరు చేశామన్నారు. వీరిలో 38 వేల మంది భూ యజమానులు పంట రుణాలు తీసుకున్నారని తెలిపారు. మిగిలిన కౌలు రైతులకు రుణాలు పొందేందుకు అర్హత ఉందని చెప్పారు. ఈ నెల 17వ తేదీ నుంచి నిర్వహించనున్న 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాల్లో బ్యాంకుల ప్రతినిధులను కూడా భాగస్వాములను చేస్తామని తెలిపారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 5,667 మంది కౌలు రైతులకు రూ.36.80 కోట్లు పంట రుణాలు మంజూరు చేశామన్నారు. గుంటూరు ఏడీఏ తోటకూర శ్రీనివాసరావు, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కంచుమాటి అజయ్‌కుమార్, ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు కె.హరిబాబు, వై.రాధాకృష్ణమూర్తి, బి.శ్రీనివాసరావు, ఎం.నాగమల్లేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఈమని అప్పారావు, బి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొత్త వైరస్ గురించి భయం వద్దు



డాక్టర్ కొర్రా విజయలక్ష్మి

గుంటూరు మెడికల్: హ్యూమన్ మెట న్యూమో వైరస్ గురించి ప్రజలు భయాందోళన చెందాల్సిన పనిలేదని, ఇది సాధారణ వైరస్ మాత్రమేనని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి తెలిపారు. 24 సంవత్సరాల క్రితమే దీనిని గుర్తించారని వెల్లడించారు. వైరస్ ద్వారా సంక్రమించే వ్యాధులకు యాంటి బయోటిక్స్ మందులు పనిచేయవని పేర్కొన్నారు. కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకోవటం ద్వారా ఈ వ్యాధి నుండి పూర్తిగా రక్షణ పొందవచ్చన్నారు. ఐదేళ్లలోపు పిల్లలు, వ్యాధినిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు, దీర్ఘకాలిక వ్యాధి బాధితులు, 60 ఏళ్లు దాటిన వారు మాత్రమే వైరస్ బారిన పడే అవకాశముందన్నారు. వ్యాధి బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు.

తీసుకోవలసిన జాగ్రత్తలు:

- తరచు చేతులు సబ్బుతో శుభ్రం చేసుకోవాలి .
- మాస్కులు ధరించాలి.
- మంచినీరు ఎక్కువగా తీసుకోవాలి
- తాజా పౌష్టికాహారం తీసుకోవాలి
- వీలైనంతవరకు బహిరంగ ప్రదేశాల్లో, మార్కెట్‌లో తిరుగకూడదు.
- దగ్గు, జలుబు ఉన్నవారికి దూరంగా ఉండాలి.
- ముక్కు, కళ్ళు తరచు చేతులతో తాకకూడదు.
- ఇతరులతో కరచాలనం చేయకూడదు.
- దగ్గు, జ్వరంతో బాధపడే పిల్లలను బడికి పంపకూడదు
- పిల్లలకు సకాలంలో ప్రభుత్వం ఇచ్చే అన్నీ టీకాలు వేయించాలి.

నా అనుచరుడినే కౌన్సెలింగ్‌కు పిలుస్తారా?

- నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో అధికార పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి హల్‌చల్
- అర్ధరాత్రి వరకు సీఐతో వాగ్వాదం


గుంటూరు: 'నా అనుచరుడినే అదుపులోకి తీసుకుంటారా? మీ సంగతి తేలుస్తా! ఎలా విధులు నిర్వహిస్తారో చూస్తా!!' అంటూ అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్సీ అభ్యర్థి పోలీస్ స్టేషన్‌లో హల్‌చల్ చేసిన సంఘటన గురువారం రాత్రి నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... అధికారపార్టీకి చెందిన ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజా నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో సుమారు మూడు గంటలపాటు అర్ధరాత్రి వరకూ హల్‌చల్ చేసినట్లు సమాచారం. గురువారం రాత్రి సమయంలో ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజా అనుచరుడు సంతోష్‌రెడ్డి అనే రౌడీ షీటర్‌ను కౌన్సెలింగ్ నిమిత్తం పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చినట్లు సమాచారం. సంతోష్‌రెడ్డికి, అరండల్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీషీట్ కలిగిన సుబానీ అనే రౌడీషీటర్‌కు మధ్య ఇటీవల జరిగిన వివాదాల నేపథ్యంలో పరస్పర దాడులకు ప్రయత్నిస్తున్నారని సమాచారంతో పోలీసులు సంతోష్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో తన అనుచరుడిని అదుపులోకి తీసుకుంటారా అని స్వయంగా టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి రంగంలోకి దిగారు. సీఐని సైతం నా వాళ్లను అరెస్ట్ చేసే ధైర్యం వచ్చిందా నీకు? అంటూ హడావుడి చేసినట్లు సమాచారం. కౌన్సెలింగ్‌కు తీసుకువచ్చినట్లు తెలిపిన సీఐ, ఇతర సిబ్బందిపైనా ఆయన దుర్భాషలాడుతూ స్టేషన్‌లోనే కూర్చుని సుమారు మూడున్నర గంటలపాటు హల్‌చల్ చేసినట్లు సమాచారం. అధికారం అండతో కనీసం పోలీసుల విధులకు సైతం ఆటంకం కలిగించారని సిబ్బంది వాపోయినట్లు తెలిసింది. సమాజానికి హాని కలిగించే ఒక రౌడీషీటర్ కోసం ఎమ్మెల్సీ అభ్యర్థి స్టేషన్‌లో తిష్టవేసి అతనిని తీసుకెళ్లే ప్రయత్నం చేయటం చూస్తే మున్ముందు పరిస్థితి ఏంటోనని స్వయంగా పోలీసులే పెదవి విరుస్తున్నట్లు సమాచారం.

రూ.7.50 లక్షల విలువైన గుట్కా ప్యాకెట్ల దహనం



చీరాల: క్యాన్సర్‌కు కారకమైన గుట్కా ప్యాకెట్లను పోలీసులు దహనం చేశారు. చీరాల వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గుట్కాల వ్యాపారి నుంచి సీజ్ చేసిన 50 బస్తాలలోని రూ.7.50 లక్షల విలువైన గుట్కా ప్యాకెట్లను కోర్టు ఉత్తర్వులతో గురువారం తహసీల్దార్ కుర్రా గోపీకృష్ణ సమక్షంలో వన్‌టౌన్ సీఐ ఎం. శ్రీనివాసరావు దహనం చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. 2020 డిసెంబర్‌లో ఈపురుపాలేనికి చెందిన కూర్మాల బాలశంకర్ గుప్తా అనే వ్యక్తి అక్రమంగా గుట్కాల వ్యాపారం చేసేవాడు. పోలీసుల తనిఖీల్లో లారీలో రవాణా చేస్తున్న 50 బస్తాల గుట్కాలు, ఖైనీలను గతంలో సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు. కోర్టు ఉత్తర్వుల మేరకు పట్టణంలోని శివారు ప్రాంతంలో గుట్కా ప్యాకెట్లు దహనం చేశామన్నారు.

కానిస్టేబుల్ పోస్టులకు 186 మందికి అర్హత



పరుగు పందెంలో అభ్యర్థులు

నగరంపాలెం: స్థానిక పోలీస్ పరేడ్ మైదానంలో కానిస్టేబుల్ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు గురువారం నిర్వహించారు. 320 మంది హాజరవ్వగా, 79 మంది ధ్రువపత్రాలు తీసుకురాకపోవడంతో వెను దిరిగారు. ఇక 241 మంది అభ్యర్థులకు శరీర కొలత పరీక్షలు జరగ్గా, 21 మంది ఛాతీ, ఎత్తు కొలతలు సరిపోక తిరస్కరించారు. 219 మందికి 1600 మీటర్ల పరుగు పందెం పోటీలు జరగ్గా, 29 మందిని అనర్హులుగా ప్రకటించారు. 187 మందికి 100 మీటర్ల పరుగు పందెం ఏర్పాటు చేయగా 108 మంది అర్హత పొందారు. 191 మందికి లాంగ్ జంప్ నిర్వహించగా, 186 మంది అర్హత సాధించారు. 241 మంది కానిస్టేబుళ్ల అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించగా, 186 మంది అర్హత సాధించారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, జిల్లా ఏఎస్పీలు కె.సుప్రజ (క్రైం), ఎ.హనుమంతు (ఏఆర్) పోటీలను పర్యవేక్షించారు.

యువర్స్

● టెక్.. టాక్

హానర్ మ్యాజిక్ 7 లైట్



సైజ్: 6.78 అంగుళాలు రిఫ్రెష్‌రేట్: 120 హెచ్‌జడ్
బ్యాటరీ: 6,600 ఎంఏహెచ్ ర్యామ్: 8జీబీ స్టోరేజ్: 256 జీబీ
వోఎస్: ఆండ్రాయిడ్ 14 బరువు: 189 గ్రా.



రెడ్ మీ బుక్ 14

స్క్రీన్: 16:10
రిజల్యూషన్: 2,880×1,800 పిక్సెల్స్
రిఫ్రెష్ రేట్: 120 హెచ్‌జడ్
బ్యాటరీ: 56 డబ్ల్యూహెచ్

సినీబీమ్ ఎస్(పీయు 615 యు) ఎల్‌జీ ప్రొజెక్టర్



● రిజల్యూషన్: 4కే యుహెచ్‌డీ(3,840×2,160) ● స్క్రీన్ సైజ్: 30–120 అంగుళాలు 40–100 అంగుళాలు ● ఆటో స్క్రీన్ అడ్జస్ట్‌మెంట్ స్పేస్ ● బరువు: 7.5 కేజీ(పిఎఫ్600యు) 2.5కేజీ (పియు615యు) ● సపోర్ట్: డల్బీ ఆటోమస్ సౌండ్ ● లైట్ వెయిట్ డిజైన్

చిన్నప్పుడు కన్న కలలు నిజం అవుతాయా? మనసు పెడితే, కష్టపడితే 'కచ్చితంగా నిజం అవుతాయి' అని చెప్పడానికి బలమైన ఉదాహరణ కాజల్, హితేంద్రసింగ్. 'స్పానిక్' స్టార్టప్‌తో తమ కలను నిజం చేసుకున్నారు... రాకెట్‌ను ప్రయోగించే ప్రక్రియలో కాలంతో పాటు ఎంతో పురోగతిని చూస్తున్నాం. దీనికి సరికొత్త చేర్పు...స్పానిక్. రీయూజబుల్ రాకెట్ లాంచ్ వెహికిల్స్ కోసం కాజల్ రాజ్జర్, హితేంద్రసింగ్ 'స్పానిక్' అనే స్టార్టప్‌ను ప్రారంభించారు.

● ఇన్నోవేషన్

స్కై స్టార్స్



● హితేంద్రసింగ్ ● కాజల్

'పునర్వినియోగ రాకెట్ లాంచ్ వెహికిల్స్‌ను స్పానిక్ అభివృద్ధి చేస్తుంది. అంతరిక్ష పరిశోధనలను అందరికీ మరింత అందుబాటులోకి తీసుకురావాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. మేము దీన్ని ఫెడెక్స్ టు స్పేస్ అని పిలవడానికి ఇష్టపడతాం' అంటున్నారు కాజల్, హితేంద్రసింగ్.

దిల్లీ కేంద్రంగా మొదలైన 'స్పానిక్' ఇప్పటికే గణనీయమైన పురోగతిని సాధించింది. ప్రభుత్వ గ్రాంట్లను పొందింది. ప్రైవేట్ ఈక్విటీ ఇన్వెస్టర్‌ల దృష్టిని ఆకర్షించింది. మోస్ట్ ప్రామిసింగ్ స్టార్టప్ 'టెక్ 30' జాబితాలో చోటు సాధించింది.

చిన్నప్పుడు పిల్లలు ఏవో కలలు కంటారు. అయితే ఆ కలలు అన్నీ నిజం కాకపోవచ్చు. చిన్న వయసులోనే 'నేను పెద్దయ్యాక స్పేస్ కంపెనీ నడపాలనుకుంటున్నాను' అని తండ్రితో చెప్పింది కాజల్. అంతేకాదు 'సొంతంగా రాకెట్లు, ఉపగ్రహాలు తయారు చేస్తాను' అని తన డైరీలో కూడా రాసుకుంది. తన లక్ష్యసాధనలో భాగంగా చెన్నైలోని ఎస్‌ఆర్‌ఎంలో చేరింది.

అక్కడ ఫిజిక్స్ చదువుకున్న కాజల్ ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక పేజీని నడిపేది. కొత్త శాస్త్రీయ ఆవిష్కరణల గురించి అందులో రాసేది. ఈ క్రమంలో కాజల్‌కు అహ్మదాబాద్‌లో చదువుకుంటున్న హితేంద్ర సింగ్‌తో పరిచయం అయింది. కాజల్‌లాగే సింగ్ కూడా చిన్నప్పుడు ఎన్నో కలలు కనేవాడు.

సోషల్ మీడియా ద్వారా పరిచయం అయిన కాజల్, హితేంద్రసింగ్‌లు సైన్స్‌కు సంబంధించి బోలెడు విషయాలు మాట్లాడుకునేవారు. అలా 'స్పానిక్' కోసం స్కెచ్ వేశారు.

ఆస్ట్రోఫిజిక్స్, కాస్మోలజీలో మాస్టర్స్ చేయడానికి గుజరాత్‌లోని 'చరోతార్ యూనివర్శిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ' చేరారు. తమ భవిష్యత్ లక్ష్యమైన 'స్పానిక్' కోసం కాలేజీ వదిలిపెట్టారు. కంపెనీ స్థాపించడానికి ముందు మానవ రహిత వైమానిక వాహనాలను (ఏరియల్ వెహికిల్స్) అభివృద్ధి చేయడం నుంచి యువిసి రోవర్ తయారీ వరకు ఎంతో అనుభవ జ్ఞానాన్ని సంపాదించారు.

అంతరిక్ష రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యానికి ప్రభుత్వం ఇచ్చిన ప్రోత్సాహం 'స్పానిక్' వడివడిగా అడుగులు వేయడానికి ఉపయోగపడింది. రీసైకిల్ చేయదగిన రాకెట్‌ల డిమాండ్‌ను అర్థం చేసుకోవడానికి ప్రైవేట్ సంస్థలు, ఇస్రో సంస్థ ప్రతినిధులతో మాట్లాడారు. నిజానికి పునర్వినియోగ రాకెట్ కాన్సెప్ట్ కొత్త కాదు. రష్యా, అమెరికా, జర్మనీలాంటి దేశాలు దశాబ్దాలుగా ఈ కాన్సెప్ట్‌పై పనిచేస్తున్నాయి. ఈ ప్రయత్నంలో ఖర్చు హద్దులు దాటేది. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఎక్కువగా ఖర్చు కాని, ఎక్కువ సార్లు ఉపయోగించే రాకెట్‌లపై దృష్టి పెట్టారు. ప్రస్తుతం కాజల్–సింగ్ బృందం వర్టికల్ టేకాఫ్ వర్టికల్ ల్యాండింగ్ (విటివిఎల్)ను నిర్మిస్తోంది. వ్యవస్థల పునర్వినియోగాన్ని అర్థం చేసుకోవడానికి ఇది వారికి సహాయపడుతుంది.

అయినా సరే...

చాలామంది స్పేస్ స్టార్టప్ వ్యవస్థాపకులు ఇస్రోలో పనిచేశారు. లేదా ఏదో ఒక హోదాతో సంస్థతో టచ్‌లో ఉన్నారు. మేము 'ఇస్రో'లో పనిచేయలేదు. 'ఇస్రో'లో పనిచేయని ఫౌండర్‌లకు సంబంధించిన స్టార్టప్ మాది. కీలక సాంకేతిక పరిజ్ఞానాన్ని రూపొందించడంపై దృష్టి పెట్టాం. ప్రసిద్ధ సంస్థలకు చెందని వ్యక్తులు కూడా సాంకేతిక స్టార్టప్‌లకు సంబంధించి ముందుకు వెళ్లగలరని నిరూపించాలనుకుంటున్నాం. ఇది ఎంతో మంది ఔత్సాహికులకు ఆత్మవిశ్వాసాన్ని ఇస్తుంది.
- కాజల్



● తపస్వీ రెడ్డి

● యంగ్ టాలెంట్

వండర్ బాయ్

టైమ్ మేనేజ్‌మెంట్ తెలిస్తే ఎంతో టైమ్ సేవ్ అవుతుంది. ఆ టైమ్‌లో ఎన్నో విద్యలు నేర్చుకోవచ్చు. 'శభాష్' అనిపించుకోవచ్చు.... దీనికి ఉదాహరణ తపస్వీరెడ్డి

తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు పట్టణానికి చెందిన కుంచాల తపస్వీరెడ్డి కరాటే, ఫ్యాన్సీ డ్రెస్, చిత్రలేఖనం, క్విజ్, వక్తృత్వం, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, చదరంగం, ఫోటోగ్రఫీ, సైన్స్, డ్యాన్స్....మొదలైన వాటిలో ప్రతిభ చూపుతున్నాడు. అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించే ఒలింపియాడ్ పరీక్షల్లో కూడా ప్రతిభ కనబరిచాడు. వియత్నాంలో నిర్వహించిన ఇంటర్నేషనల్ మోడల్ యునైటెడ్ నేషన్స్ సదస్సుకు ఎంపికయ్యాడు.

వందకి పైగా జాతీయ, అంతర్జాతీయ దినోత్సవాలు, తేదీలు వాటికి సంబంధించిన వివరాలను చెప్పి అంతర్జాతీయ 'వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు'లో చోటు సాధించాడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే ఛాంపియన్ షిప్ –2024లో అండర్ –14 బ్లాక్‌బెల్ట్ విభాగంలో గోల్డ్ మెడల్, కుమిటేలో కాంస్య పతకం గెలుచుకున్నాడు.

ఇస్రో అంతరిక్ష వారోత్సవాలు 2023ను పురస్కరించుకుని తణుకులో నిర్వహించిన చిత్రలేఖనం పోటీలో, రాజమండ్రిలో నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌లో ప్రథమ బహుమతి సాధించాడు. ఉత్తర్‌ప్రదేశ్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి ఫోటోగ్రఫీ పోటీలో 674 మందితో పోటీపడి ఐదో స్థానంలో నిలిచి ప్రశంస పత్రం అందుకున్నాడు. ఇంటర్నేషనల్ స్టాండర్డ్ నాలెడ్జ్ ఒలింపియాడ్ 2023–24 రాష్ట్ర స్థాయిలో 5వ ర్యాంక్ సాధించాడు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రోటరీ క్లబ్ వారు నిర్వహించిన ఫాన్సీ డ్రెస్ పోటీలో మహాత్మా గాంధీ వేషధారణతో పాల్గొని ప్రథమ బహుమతి గెలుచుకున్నాడు. యువజన మాసోత్సవాల్లో భాగంగా ఫ్యాన్సీడ్రెస్ పోటీలో కృష్ణుడి వేషధారణలో ప్రథమ బహుమతి గెలుచుకున్నాడు.

– గాడి శేఖర్ బాబు, నిడదవోలు, సాక్షి

డాక్యుమెంట్స్ స్కాన్ చేయడానికి...



ఇన్‌స్టంట్ మెసేజింగ్ యాప్ వాట్సాప్ ఎప్పటికప్పుడు కొత్త ఫీచర్‌లను అందుబాటులోకి తెస్తోంది. ఈ యాప్‌లో ఎన్నో ఫీచర్‌లు ఉన్నప్పటికీ డాక్యుమెంట్‌లను స్కాన్ చేసి పంపడానికి థర్డ్ పార్టీ యాప్‌లపై ఆధారపడాల్సి వస్తోంది. లేటెస్ట్ అప్‌డేట్‌తో ఐఫోన్ యూజర్‌ల కోసం కొత్త ఫీచర్‌ను అందుబాటులోకి తీసుకువస్తోంది వాట్సాప్. ఇన్–యాప్ కెమెరాను ఉపయోగించి డాక్యుమెంట్లను స్కాన్ చేసి, వారి కాంటాక్ట్ లిస్ట్‌లో ఉన్న ఎవరితోనైనా షేర్ చేసుకునే అవకాశం కల్పిస్తుంది.

వాట్సాప్‌లో డాక్యుమెంట్స్ స్కాన్ చేయడానికి...
● వాట్సాప్ ఓపెన్ చేసిన తరువాత బాటమ్ బార్‌లోని 'బటన్'ను నొక్కాలి. ● డాక్యుమెంట్స్–సెలెక్ట్ ● 'చూజ్ ఫ్రమ్ ఫైల్స్' 'చూజ్ ఫోటోస్ ఆర్ వీడియో' 'స్కాన్ డాక్యుమెంట్' అనే మూడు ఆప్షన్‌లు కనిపిస్తాయి ● థర్డ్ ఆప్షన్ క్లిక్ చేస్తే ఇన్–కెమెరా ఓపెన్ అవుతుంది ● స్కాన్ చేసిన తరువాత ఇతరులకు షేర్ చేయవచ్చు.

అవును... ఇది నిజమే!



● 'యస్...ఈ పని నేను కచ్చితంగా చేయగలను' అని ఒకటికి పదిసార్లు గట్టిగా అనుకోవడం మనం చేసే పనిపై సానుకూల ప్రభావం చూపుతుంది అంటున్నారు వ్యక్తిత్వ వికాస నిపుణులు.
● జపాన్‌లో 'హిరోషిమా పీస్ ఫ్లేమ్' 1964 నుంచి నిరంతరాయంగా వెలుగుతూనే ఉంది. ● జపాన్‌లో 'థ్యాంకు యూ'కు ప్రత్యామ్నాయంగా '39' వాడుతారు.

● గేమింగ్

అపురూప అగ్నితేజం



ఫైనల్ ఫాంటసీ 7(ఫర్ పీసీ) రీబర్త్ ఈ నెలలో విడుదల కానుంది. 'ఫైనల్ ఫాంటసీ 7 రిమేక్'కి సీక్వెల్‌గా వస్తున్న గేమ్ ఇది. రియల్–టైమ్ యాక్షన్‌కు స్ట్రాటజిక్, రోల్–ప్లేయింగ్ ఎలిమెంట్స్ జోడించి రూపొందించిన ఈ గేమ్‌లో క్లౌడ్ స్ట్రైఫ్(ఫైనల్ ఫాంటసీ సిరీస్‌లో ప్రధాన పాత్ర) పార్టీ ఆఫ్ క్యారెక్టర్లు(రెడ్, విన్‌సెంట్, సిడ్, టిఫా, బారెట్...మొదలైన క్యారెక్టర్స్) ప్లేయర్స్ కంట్రోల్ చేయాల్సి ఉంటుంది.

మునుపటి గేమ్‌లలోని ప్రధాన క్యారెక్టర్లు తాజా గేమ్‌లో కూడా కనిపిస్తాయి.

సిరీస్: ఫైనల్ ఫాంటసీ ఇంజిన్: అన్‌రియల్ ప్లాట్‌ఫామ్స్: ప్లేస్టేషన్ 5, విండోస్ జానర్స్: యాక్షన్ రోల్–ప్లేయింగ్
మోడ్స్: సింగిల్–ప్లేయర్

సాక్షి సినిమా



కావేరి పాత్ర నాకో సవాల్

- ప్రగ్యా జైస్వాల్

''డాకు మహారాజ్'లో నేను కావేరి పాత్ర చేశాను. నటనకు ఆస్కారం ఉన్న మంచి క్యారెక్టర్ ఇది. మొదటిసారి డీ గ్లామరస్ రోల్ చేశాను.. నేనిప్పటి వరకు చేసిన పాత్రలకు భిన్నంగా ఈ క్యారెక్టర్‌ని బాబీగారు అద్భుతంగా తీర్చిదిద్దారు. ఈ పాత్ర చేయడం నాకు సవాల్‌గా అనిపించింది'' అని ప్రగ్యా జైస్వాల్ తెలిపారు. బాలకృష్ణ హీరోగా బాబీ కొల్లి దర్శకత్వం వహించిన చిత్రం 'డాకు మహారాజ్'. ప్రగ్యా జైస్వాల్, శ్రద్ధా శ్రీనాథ్ హీరోయిన్లుగా నటించారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 12న విడుదల కానుంది. ఈ సందర్భంగా ప్రగ్యా జైస్వాల్ విలేకరులతో మాట్లాడుతూ– ''2015లో 'కంచె' సినిమాతో తెలుగులో నా ప్రయాణం మొదలైంది. ఈ ప్రయాణంలో సినిమా గురించి ఎన్నో విషయాలు నేర్చుకున్నాను. బాలకృష్ణగారితో 'అఖండ, డాకు మహారాజ్, అఖండ–2'.. ఇలా వరుస సినిమాలు చేసే అవకాశం రావడం గౌరవంగా భావిస్తున్నాను. తెలుగులో అగ్ర నిర్మాణ సంస్థల్లో ఒకటైన సితార ఎంటర్‌టైన్మెంట్స్‌లో నటించడం హ్యాపీగా ఉంది. ఈ నెల 12న నా పుట్టినరోజు. నేను నటించిన 'డాకు మహారాజ్'అదే రోజు రిలీజ్ కావడం నా లక్'' అని చెప్పారు.

సాయికుమార్ గోల్డెన్ జూబ్లీ



"కనిపించే ఈ మూడు సింహాలు న్యాయానికి, నీతికి, ధర్మానికి ప్రతిరూపాలైతే, కనిపించని ఆ నాలుగో సింహమేరా.. పోలీస్...' అనే డైలాగ్ వింటే... వెంటనే సాయికుమార్ అని ఆడియన్స్ చెప్పేస్తారు. అంటూ 'పోలీస్ స్టోరీ'లో ఆయన తనదైన శైలిలో పవర్‌ఫుల్‌గా చెప్పి, ఆకట్టుకున్నారు. నటుడిగా, డబ్బింగ్ ఆర్టిస్టుగా ఇండస్ట్రీలో తనకంటూ ఓ ప్రత్యేకతను చాటుకున్న సాయికుమార్ ఇండస్ట్రీలోకి వచ్చి యాభై సంవత్సరాలు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా సాయికుమార్ గురించి కొన్ని విశేషాలు...

1972 అక్టోబరు 20న 'మయసభ' అనే నాటకంలో దుర్యోధనుడి పాత్ర కోసం తొలిసారి మేకప్ వేసుకున్నారు సాయికుమార్. ఆయన వెండితెర ప్రయాణం 'దేవుడు చేసిన పెళ్లి' చిత్రంతో జరిగింది. బాపు దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో సాయికుమార్ బాలనటుడిగా చేశారు. ఈ మూవీ 1975 జనవరి 9న రిలీజైంది. గురువారంతో (జనవరి 9) వెండితెరపై సాయికుమార్ యాభైఏళ్ల నట ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్నారు. ముందు డబ్బింగ్ ఆర్టిస్టుగానే కెరీర్ మొదలుపెట్టారు సాయికుమార్. ఆ తర్వాత 'ఛాలెంజ్, కలికాలం, మేజర్ చంద్రకాంత్' వంటి తెలుగు సినిమాల్లో నటిస్తూనే, 'తయ్యల్‌క్కారన్, కావల్ గీతమ్' వంటి తమిళ సినిమాల్లోనూ నటించారు. 1996లో సాయికుమార్ హీరోగా వచ్చిన కన్నడ చిత్రం 'పోలీసు స్టోరీ' బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఈ సినిమాలోని సాయి కుమార్ నటనకు ఆడియన్స్ ఫిదా అయ్యారు. ఈ సినిమా తెలుగు, తమిళ భాషల్లో అనువాదమై, విజయం సాధించింది. 'పోలీసు స్టోరీ' తర్వాత ఆయన పాతిక చిత్రాల్లో పోలీస్ ఆఫీసర్‌గా నటించారు. ఇక తెలుగులో 'అమ్మ రాజీనామా, కర్తవ్యం, అంతఃపురం, ఈశ్వర్ అల్లా, జగద్గురు ఆది శంకర, ఎవడు, పటాస్, పండుగ చేస్కో, భలే మంచి రోజు, సరైనోడు, జనతా గారేజ్, ఓం నమో వెంకటేశాయ, జై లవ కుశ, రాజా ది గ్రేట్, నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా, మహర్షి, ఎస్ఆర్ కల్యాణమండపం, దసరా, సార్...' ఇలా ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో సాయికుమార్ నటించారు. 50 ఏళ్ల కెరీర్‌లో హీరోగా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా మెప్పించిన సాయికుమార్ విలన్‌గానూ నిరూపించుకున్నారు. 'సామాన్యుడు, ప్రస్థానం, ఎవడు..' వంటి చిత్రాల్లో విలన్‌గా చేశారు. కేవలం వెండితెరకు మాత్రమే పరిమితం కాకుండా, బుల్లితెరపై రాణిస్తున్నారు సాయికుమార్. ఇక ఆయన తమ్ముళ్లు అయ్యప్ప పి.శర్మ, పి. రవిశంకర్ డబ్బింగ్ ఆర్టిస్టులుగా, నటులుగా సినిమా రంగంలోనే రాణిస్తున్నారు. ఆయన కొడుకు ఆది సాయికుమార్ హీరోగా చేస్తున్నారు.

"చిన్న సినిమా, పెద్ద సినిమా... దేనికైనా మంచి కథే ప్రాణం. నా కెరీర్ ఆరంభం నుంచి కూడా కథను నమ్ముకునే సినిమాలు తీశాను. ఈ సృష్టిలో తల్లిని మించిన దైవం లేదు. మా అబ్బాయి అనంత కిశోర్ నిర్మించిన 'తల్లి మనసు' సినిమా అద్భుతమైన కథతో రూపొందింది. ప్రతి తల్లి, కుటుంబమంతా కలిసి చూడాల్సిన చిత్రం ఇది" అని ప్రముఖ సీనియర్ దర్శకులు, చిత్ర సమర్పకులు ముత్యాల సుబ్బయ్య చెప్పారు. రచితా మహాలక్ష్మి, కమల్ కామరాజు, సాత్విక్, సాహిత్య ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'తల్లి మనసు'. ముత్యాల సుబ్బయ్య వద్ద దర్శకత్వ విభాగంలో పని చేసిన వి. శ్రీనివాస్ (సిప్పీ) ఈ చిత్రం ద్వారా దర్శకునిగా పరిచయమవుతున్నారు. ముత్యాల సుబ్బయ్య సమర్పణలో ఆయన తనయుడు ముత్యాల అనంత కిశోర్ నిర్మించిన తొలి చిత్రం 'తల్లి మనసు'. ముత్యాల మూవీ మేకర్స్ పతాకంపై రూపొందిన ఈ చిత్రం ఈ నెల 24న విడుదల కానుంది. ఈ సందర్భంగా ముత్యాల సుబ్బయ్య విలేకరులతో పంచుకున్న విశేషాలు.



కుటుంబమంతా తల్లి మనసు చూడాలి

- ముత్యాల సుబ్బయ్య

● దర్శకుడిగా నా తొలి చిత్రం 'మూడుముళ్ల బంధం'తో మంచి పేరు వచ్చింది కానీ అవకాశాలు రాలేదు. ఆ తర్వాత టి. కృష్ణగారి వద్ద అసోసియేట్ డైరెక్టర్‌గా చేశాను. ఆ తర్వాత నేను దర్శకత్వం వహించిన 'అరుణ కిరణం' (1986) సినిమా సూపర్‌హిట్‌గా నిలిచింది. ప్రముఖ హీరోలందరితోనూ సినిమాలు తీశాను. దర్శకుడిగా 50 సినిమాలు తీశాను.. వాటిలో అద్భుతమైన హిట్‌తో పాటు కొన్ని ఫెయిల్యూర్స్ లేకపోలేదు. అయినప్పటికీ ఏ రోజూ ఏదో సినిమా చేసెయ్యాలని, చుట్టేయాలని అనుకోలేదు. సమాజానికి ఉపయోగపడే పాయింట్‌తో పాటు సెంటిమెంట్, కామెడీ, డ్రామా వంటి అంశాలను మేళవించి సినిమాలు చేశాను. సెంటిమెంట్ సినిమాల కారణంగా నాకు సెంటిమెంట్ సుబ్బయ్య అని పేరొచ్చింది ● నిర్మాతగా నేను ఒక్క సినిమా కూడా తీయలేదు. మా పెద్ద అబ్బాయి అనంత కిశోర్‌కు ఒక మంచి సినిమా తీయాలనే అభిరుచి ఉండటంతో 'తల్లి మనసు' నిర్మించాం. నేను సీనియర్ దర్శకుడిని అయినప్పటికీ శ్రీనివాస్‌కి సూచనలు, సలహాలు ఇచ్చానే తప్ప ఎక్కడా కల్పించుకోలేదు. నా మనసుకి సంతృప్తినిచ్చిన చిత్రమిది. థియేటర్ నుంచి బయటికి వచ్చిన తర్వాత 'ఓ మంచి సినిమా చూశాం' అని ప్రేక్షకులు అనుకుంటారు.


నా లక్ష్యం నెరవేరింది

- కృష్ణ కాంత్



''తెలుగు సినిమాలకు నేరుగా పాటలు రాయడం సులభం. పైగా కావాల్సినంత స్వేచ్ఛ ఉంటుంది. కానీ, డబ్బింగ్ సినిమాలకు పాటలు రాసేటప్పుడు ఆయా భాషలో వాడిన పదాలకు సరిపోయే తెలుగు పదాలను ఎంచుకుని రాయాలి. అందుకే స్ట్రయిట్ సాంగ్స్‌తో పోలిస్తే డబ్బింగ్ పాటలు రాయడం చాలా కష్టం'' అని పాటల రచయిత కృష్ణకాంత్ (కేకే) చెప్పారు. నేడు (జనవరి 10) ఆయన పుట్టినరోజు. ఈ సందర్భంగా గురువారం కృష్ణకాంత్ విలేకరులతో మాట్లాడుతూ– ''పాటల రచయితగా పేరు తెచ్చుకోవాలని ఉద్యోగం వదులుకుని ఇండస్ట్రీకి వచ్చాను. ఆ లక్ష్యం నెరవేరిందనే సంతృప్తి కలుగుతోంది. 2024లో నేను రాసిన స్ట్రయిట్, డబ్బింగ్ పాటలన్నీ మ్యూజిక్ లవర్స్‌ను ఆకట్టుకుని వైరల్‌గా మారడం సంతోషంగా ఉంది. ఒక సినిమా కథ మొత్తం తెలిస్తే పాటల రచయితకు అడ్వాంటేజ్ ఉంటుంది. అలా నేను సింగిల్ కార్డ్ రాసిన 'పడి పడి లేచె మనసు, సీతారామం (ఐదు పాటలు), సలార్, రాధే శ్యామ్' సినిమాల పాటలన్నీ సూపర్ హిట్ అయ్యాయి. గతేడాది నేను రాసిన పాటల్లో 'హాయ్ నాన్న'లోని 'అడిగా..' పాట బాగా సంతృప్తిని ఇచ్చింది. మలయాళ డబ్బింగ్ మూవీ 'ఏఆర్ఎం', రజనీకాంత్‌గారి 'వేట్టయాన్', శివకార్తికేయన్‌గారి 'అమరన్' సినిమాలకు రాసిన పాటలకు మంచి పేరొచ్చింది. సాటి గీత రచయితలు నాతో స్నేహంగా ఉంటారు. నేను మంచి పాట రాసినప్పుడు చంద్రబోస్ గారు అభినందిస్తారు. ప్రస్తుతం ప్రశాంత్ వర్మ 'అధీర' మూవీకి డైలాగ్స్ రాస్తున్నాను. 'రాజాసాబ్', ప్రభాస్–హను రాఘవపూడి, రామ్ పోతినేని, విజయ్ దేవరకొండ–గౌతమ్ తిన్ననూరి చిత్రాలకు పాటలు రాస్తున్నాను'' అని చెప్పారు.

సింగర్ జయచంద్రన్ మృతి



ప్రముఖ గాయకుడు పి.జయచంద్రన్(80) ఇకలేరు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన కేరళలోని త్రిసూర్‌లో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ, గురువారం తుది శ్వాస విడిచారు. 1944 మార్చి 3న కొచ్చిలో జన్మించిన జయచంద్రన్ 1965లో వచ్చిన 'కుంజలి మరక్కర్' అనే సినిమాలోని 'ఒరు ముల్లప్పుమలమే..' పాటతో గాయకుడిగా పరిచయమయ్యారు. 1967లో విడుదలైన 'కలితోజన్' చిత్రంలోని 'మంజలైల్ ముంగి తోర్తి' పాట ఆయన కెరీర్‌లో ఒక మైలురాయి. ఆరు దశాబ్దాలకుపైగా తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో దాదాపు 16 వేలకుపైగా పాటలు పాడారాయన. జయచంద్రన్ తెలుగులో పాడిన 'రోజావే చిన్ని రోజావే (సూర్యవంశం), అనగనగా ఆకాశం ఉంది (నువ్వే కావాలి), హ్యాపీ హ్యాపీ బర్త్‌డేలు (సుస్వాగతం)' వంటి పాటలు సూపర్ హిట్‌గా నిలిచాయి. 2002లో వచ్చిన 'ఊరు మనదిరా'లో పాడిన 'నా చెల్లి చంద్రమ్మ' తెలుగులో ఆయన చివరి పాట. ఇళయరాజా, ఏఆర్ రెహమాన్, ఎం.ఎం. కీరవాణి, విద్యాసాగర్, కోటి వంటి సంగీత దర్శకుల సినిమాలకు ఆయన ఎక్కువగా పాటలు పాడారు. హిందీలో ఏఆర్ రెహమాన్ సంగీతం అందించిన 'అదా: ఎ వే ఆఫ్ లైఫ్' అనే ఒకే ఒక మూవీలో పాడారు జయచంద్ర. అదేవిధంగా తన మాతృ భాష మలయాళంలో 'నఖక్ష తంగళ్', 'త్రివేండ్రం లాడ్జ్' వంటి సినిమాల్లో అతిథి పాత్రల్లో మెరిశారాయన. అంతేకాదు.. 'శ్రీ నారాయణ గురు' అనే మలయాళ సినిమాలోని 'శివ శంకరా సర్వ శరణ్య విభో..' పాటకుగానూ 'బెస్ట్ మేల్ ప్లే బ్యాక్ సింగర్'గా 1986లో జాతీయ అవార్డు అందుకున్నారు. అలాగే ఐదు కేరళ స్టేట్ ఫిల్మ్ అవార్డులు, రెండు తమిళనాడు స్టేట్ ఫిల్మ్ అవార్డులు కూడా ఆయన్ని వరించాయి. జయచంద్రన్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయన మృతి పట్ల పలువురు సినీ ప్రముఖులు, సంగీత దర్శకులు, గాయకులు సంతాపం తెలిపారు.

థ్రిల్లింగ్ బూమరాంగ్



● అనూ ఇమ్మాన్యుయేల్

అనూ ఇమ్మాన్యుయేల్ ప్రధాన పాత్రలో, శివ కందుకూరి, 'వైవా' హర్ష, 'వెన్నెల' కిశోర్, ఎస్. నివాసిని, షానీ సాల్మన్ ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'బూమరాంగ్'. ముప్పై సినిమాలకుపైగా సినిమాటోగ్రాఫర్‌గా చేసిన ఆండ్రూ బాబు 'బూమరాంగ్' మూవీతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. లండన్ గణేశ్, డా. ప్రవీణ్ రెడ్డి వూట్ల ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సితార ఫిల్మ్స్ లిమిటెడ్ లైన్ ప్రొడక్షన్ నిర్వహిస్తోంది. ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను హీరో వెంకటేశ్ రిలీజ్ చేశారు. ''కర్మ ఇతివృత్తాన్ని రెండు సమాంతర కథాంశాలతో సీట్ ఎడ్జ్ థ్రిల్లర్ మూవీగా ఈ సినిమాను తీస్తున్నాం. ఈ సినిమా ఆడియన్స్‌కు మంచి అనుభూతినిస్తుంది'' అని యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: అనూప్ రూబెన్స్.